ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 7 సెప్టెంబరు 2024



గోరంట్లలో ఉత్సాహంగా వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న బాలుడు

హిందూపురంలోని పూలమార్కెట్‌లో సందడి



రావయ్యా.. బొజ్జ గణపయ్యా..!

నేడు వినాయక చవితి

కొలువుదీరనున్న గణనాథులు
మండపాలు ముస్తాబు

హిందూపురం, సెప్టెంబరు 6: వినాయక చవితి వేడుకలకు వేళయింది. ఎటుచూసినా సందడి కనిపిస్తోంది. వినాయక చవితి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా ముస్తాబైంది. ఉత్సవ కమిటీల నిర్వాహకులు ఇప్పటికే మండపాలను సిద్ధం చేశారు. గణనాథులను కూడా తరలించారు. గణపయ్యలను కొలువుదీర్చి, ప్రత్యేక పూజలు చేయనున్నారు. కొన్నిచోట్ల మూడు, మరికొన్ని చోట్ల ఐదురోజులపాటు వినాయకుడికి పూజలు చేయనున్నారు. హిందూపురంలో ఏడు రోజులపాటు గణపయ్య పూజలు అందుకోనున్నారు. పోటాపోటీగా భారీ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. హిందూపురంలో సుమారు పెద్ద విగ్రహాలు 50దాకా మండపాల్లోనే తయారు చేయించగా.. మరో 200కుపైగా విగ్రహాలను కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. వీధికి రెండు, మూడు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. దీంతో శుక్రవారం విగ్రహాలను కొనుగోలు చేసి, తరలించడంతో ఎక్కడ చూసినా సందడి కనిపించింది. విగ్రహాల ధరలను తయారీదారులు అమాంతం పెంచేశారు.

మార్కెట్లు కిటకిట

వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో శుక్రవారం పూలు, పండ్లు, పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. పెద్దఎత్తున జనం తరలిరావడంతో ఎటుచూసినా కిక్కిరిసిపోయింది. ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పండుగ నేపథ్యంలో పూల ధరలు అమాంతం పెంచేశారు.

గోరంట్లలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



కదిరిలోని కాలేజీ సర్కిల్‌లో కొనుగోళ్ల సందడి



పెనుకొండలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మట్టి వినాయక ప్రతిమలు



రేపు యూటీఎఫ్ క్రీడాపోటీలు

ధర్మవరం, సెప్టెంబరు 6: ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 8న మడకశిరలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మడకశిరలోని జూనియర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, 100, 200 మీటర్ల పరుగు, 400 మీటర్ల నడక, షాట్‌పుట్, జావెలిన్ త్రో, క్యారమ్స్ తదితర అంశాల్లో పోటీలుంటాయన్నారు. మహిళా టీచర్లకు ఈనెల 14న కదిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బ్యాడ్మింటన్, త్రోబాల్, షాట్‌పుట్, స్పీడ్‌వాక్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీ హాస్టళ్ల అభివృద్ధి

- మంత్రి సవిత
- రాంపురంలో ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రారంభం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 6: టీడీపీ పాలనలోనే బీసీ గురుకుల పాఠశాలలు అభివృద్ధి చెందాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని రాంపురంలో ఎంజేపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ హాస్టళ్ల కోసం భారీగా నిధులు మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రెసిడెన్సియల్ హాస్టళ్లన్నీ టీడీపీ హయాంలో ఏర్పటైనవేనన్నారు. టీడీపీ ప్రభుత్వం ముందుచూపువల్ల నేడు ఎంతో మంది బీసీ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగారన్నారు. మరో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరగా.. తక్షణం స్పందించి నియోజకవర్గానికి మంజూరు చేశారన్నారు. ఏడాదిలోగా గురుకుల పాఠశాలకు పక్కా భవనాలు నిర్మిస్తామన్నారు. ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు నలిగిపోయారన్నారు. ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో నానా ఇబ్బందులు పడ్డారు. గత టీడీపీ హయాంలో 90శాతం వరకు పూర్తయిన రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను కూడా పూర్తి చేయలేని అసమర్థుడు జగన్ అని విమర్శించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే రాంపురం పాఠశాలలో తరగతులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ఎంజేపీ పాఠశాలల కన్వీనర్ రమాదేవి, ప్రిన్సిపాల్ జమున, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

అప్పుల పాలయ్యాం.. ఆదుకోండి..

మంత్రికి వైసీపీ మద్దతు సర్పంచ్‌ల మొర



మంత్రిని సన్మానిస్తున్న వైసీపీ మద్దతు సర్పంచ్‌లు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 6: గత వైసీపీ పాలనలో సొంత డబ్బుతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసి, బిల్లులు రాక అప్పులపాలయ్యామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత వద్ద పలువురు వైసీపీ మద్దతు సర్పంచ్‌లు మొరపెట్టుకున్నారు. తమను ఆదుకోవాలని కోరారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం మంత్రిని పలువురు సర్పంచ్‌లు కలిశారు. తమ సమస్యలను వివరించారు. గతంలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పనులకు సంబంధించిన బిల్లులు రాకుండా అడ్డుకున్నారనీ, అనంతరం వచ్చిన ఉషశ్రీకూడా అదే తరహాలో ఇబ్బంది పెట్టారన్నారు. తీవ్రంగా నష్టపోయామని గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో సర్పంచ్‌లను దిష్టిబొమ్మలుగా మార్చారన్నారు. వారి నిధులు కూడా దుర్వినియోగం చేశారన్నారు. చంద్రబాబు పాలనలో సర్పంచ్‌లకు గుర్తింపు లభిస్తుందన్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో యర్రమంచి, వెంకటగిరిపాళ్యం, మావటూరు, మునిమడుగు, శెట్టిపల్లి, గుట్టూరు, గోనిపేట సర్పంచ్‌లు ఉన్నారు.

వరద బాధితులకు 34,800 పాల ప్యాకెట్లు

పుట్టపర్తి, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులకు జిల్లా తరఫున 34,800 టెట్రా పాల ప్యాకెట్లను అందజేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అర లీటరు ప్యాకెట్లను వ్యాన్ ద్వారా విజయవాడలో బాధితులకు పంపిణీ చేశామన్నారు. వరద బాధితులకు సాయం అందజేసిన జిల్లా ప్రజలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.



పాల ప్యాకెట్లను తరలిస్తున్న వాహనం

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

రూ.16 లక్షల జరిమానా

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 6: చెక్ బౌన్స్ కేసులో బుక్కపట్నానికి చెందిన రమేష్‌బాబుకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ స్థానిక కోటర్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప తీర్పు వెల్లడించినట్లు కోర్టు పోలీసు శుక్రవారం తెలిపారు. రమేష్‌బాబు.. నగదు లావాదేవీల్లో భాగంగా హిందూపురానికి చెందిన మల్లికార్జునకు రూ.8 లక్షలకు చెక్కు ఇచ్చాడు. 2023లో చెక్ బౌన్స్ కావడంతో బాధితుడు.. కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారించిన న్యాయాధికారి.. నిందితుడు రమేష్‌బాబుకు ఏడాది జైలుశిక్ష విధించారు. రూ.8లక్షల చెక్‌బౌన్స్‌కుగాను రూ.16లక్షల జరిమానా కూడా వేశారని కోర్టు పోలీసు వెల్లడించారు.

ప్రతి ఒక్కరికీ పోషకాహారం అందించాలి

కలెక్టర్ టీఎస్ చేతన్



పోషణ్ అభియాన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, సెప్టెంబరు 6: ప్రతి ఒక్కరికీ పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో పోషణ్ అభియాన్ పోస్టర్లను కలెక్టర్ శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. పోషకాహారంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు దృఢంగా ఉన్నపుడే దేశం బలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమల్లీశ్వరి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి.. జిల్లా వైద్యాధికారి మంజువాణి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి మంజువాణి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 6: ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని కరణం సుబ్బమ్మనగర్‌లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందితో కలిసి ఆమె సర్వే చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా, వాటి కాటు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కేసీకే నాయక్, వైద్యాధికారి జ్యోత్స్న పాల్గొన్నారు.

ఇక.. అంతేనా..!

ప్రశ్నార్థకంగా నాడు- నేడు పనులు

నిధులు విడుదల చేయని గత ప్రభుత్వం
నిలిచిపోయిన స్కూళ్లు, ఆస్పత్రుల అభివృద్ధి
పాడైపోయిన నిర్మాణ సామగ్రి
చేసిన పనులన్నీ నాసిరకమే..!
కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగేనా?

లేబొరేటరీ గది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి



యాడికి, సెప్టెంబరు 6: నాడు-నేడు కార్యక్రమంతో ఆస్పత్రులను అభివృద్ధి చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమీద రాతలయ్యాయి. మండలకేంద్రంలో రూ.1.94కోట్లు, రాయలచెరువులో రూ.1.86కోట్లు వ్యయంతో



నాడు-నేడు కింద ఆస్పత్రుల నిర్మాణం కోసం 2022లో శంకుస్థాపన చేశారు. 'మెరుగైన వైద్యసేవలు అందిస్తాం. రోగులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు' అంటూ శంకుస్థాపన రోజు ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించారు. తర్వాత కొద్దిమేరకు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆస్పత్రుల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో యాడికిలో శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లోనే రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి పైకప్పు పెచ్చులు ఊడి పడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని రోగులు, వైద్యులు ఆందోళన చెందుతున్నారు. రాయలచెరువులో చెట్ల కింద రోగులకు వైద్యం చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

భయంగా ఉంది



యాడికిలో ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. గోడలు అన్ని నెర్రెలు చీలాయి. చికిత్స కోసం హాస్పిటల్‌కు వెళ్లాలంటే భయంగా ఉంది. నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకొని రోగులకు మెరుగైన సేవలు అందించాలి.

-నరసింహులు, పిన్నేపల్లి

ప్రజాధనం వృథా



వైసీపీ పాలనలో నాడు-నేడు కింద చేపట్టిన ఆస్పత్రి నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని నాయకులు ఇచ్చిన హామీ ఒట్టిమాటే. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు ఆగిపోయినట్లు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో భవన నిర్మాణాలు పూర్తి చేయాలి. లేకుంటే ప్రజాధనం వృథా అవుతుంది.

-రామకృష్ణ, కోనుప్పలపాడు



ప్రమాదకరంగా మారిన పైకప్పు

పూర్తికాని రెండో విడత పనులు



సీకేపల్లి ఉన్నత పాఠశాలలో పాత ట్యాంకు నీటిని తాగుతున్న విద్యార్థులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలో రెండో విడత నాడు-నేడు పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. 40 పాఠశాలల అభివృద్ధికి రూ.9.61 కోట్లు కేటాయించగా పనులు చేపట్టారు. అదనపు తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, మేజర్, మైనర్ రిపేరీలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఏవీ సక్రమంగా పూర్తికాలేదు. నాడు-నేడు పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే అప్పట్లో కొందరు వైసీపీ నాయకులు కొందరు కమిటీలను పక్కనపెట్టి పాఠశాలలో పనులు చేపట్టారు. అప్పట్లో పనులు ఇష్టానుసారంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నిధుల కొరతతో కొన్ని పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. వంట గదుల నిర్మాణం కూడా పూర్తి కాకపోవడంతో ఆరుబయటే వంటను తయారుచేస్తున్న పరిస్థితి ఉంది. పలు పాఠశాలల్లో ప్రహరీలు లేని పరిస్థితి ఉంది. పాఠశాలలో విద్యార్థులకు రక్షితమైన తాగునీటిని అందించడానికి నాడు-నేడు కింద ప్రభుత్వం సరఫరా చేసిన వాటర్‌ఫిల్టర్లు మూలనపడ్డాయి. మండలానికి 17 యూనిట్లు రాగా ఏడు ఫిల్టర్లు మాత్రమే పని చేస్తున్నట్టు తెలిసింది. మిగిలినవి ఆయా పాఠశాలలో నిరుపయోగంగా ఉన్నాయి. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను కూటమిప్రభుత్వంలోనైనా త్వరగా పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదేశాలు రాగానే పనులు చేపడతాం



నాడు-నేడు ఫేజ్-2 కింద పనులు నిలిచిపోయింది వాస్తవమే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు ఆపేశాం. డీఈఓ నుంచి తదుపరి ఆదేశాలు రాగానే పనులు మొదలు పెట్టి, పూర్తి చేస్తాం.

-ప్రసూన్‌కుమార్‌నాయుడు, ఎంఈఓ-2, సీకేపల్లి



కేజీబీవీలో అర్ధంతరంగా నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం






న్యామద్దల ఉన్నత పాఠశాలలో ఆరుబయటే మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న దృశ్యం, సీకేపల్లి ఉన్నత పాఠశాలలో వృథాగా ఉన్న వాటర్‌ఫిల్టర్

58 పాఠశాలల్లో ఆగిన పనులు

శింగనమల, సెప్టెంబరు 6: గత వైసీపీ పాలనలో మూడేళ్ల కిందట మండలంలోని 58 పాఠశాలల్లో నాడు నేడు పనులకు శ్రీకారం చుట్టారు. అధిక నిధులు తీసుకొచ్చి పాఠశాలలను బాగు చేస్తామని నాటి ఎమ్మెల్యే జొన్నగడ్డల పద్మావతి భర్త, అప్పటి ప్రభుత్వ సలహాదారుడు ఆలూరు సాంబ శివారెడ్డి గొప్పలు చెప్పాడు. మూడేళ్లు గడిచినా మండలంలోని ఏ ఒక్క పాఠశాలలో ఈ పనులను పూర్తి చేయలేదు. శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ పనులనూ ఆలూరు సాంబశివారెడ్డి తన బంధువైన కాంట్రాక్టర్‌కు ఇచ్చి.. అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్ పనులను నాసిరకంగా చేయడంతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి.



శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో పెచ్చులూడిన కప్పు..

శింగనమల పాఠశాలలో వర్షానికి చేరిన నీరు



అన్నీ పెండింగ్...

శింగనమల సాంబశివారెడ్డి సొంత మండలంలో కావడంతో రెండు విడతల్లో 58 పాఠశాలల్లో నాడు నేడు కింద పనులకు రూ.కోట్లను మంజూరు చేయించుకున్నారు. కాంట్రాక్టర్లుగా ఉన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలకే ఆ పనులు అప్పగించారు. మొదటిగా పాఠశాలలో పైకప్పు, ఫ్లోరింగ్, బోర్డుల నిర్మాణాల పనులు చేపట్టారు. అయితే వాటికి బిల్లులు రాకపోవడంతో ఆ పనులను కాంట్రాక్టర్లు నిలిపేశారు. చేసిన పనుల్లోనూ నాణ్యత లేకపోవడంతో ఏడాది నుంచే పై కప్పులు పెచ్చులూడుతున్నాయి. వర్షం పడినప్పుడు ఎక్కడ పెచ్చులూడి పడతాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చాలా పాఠశాలలో ఆ పనులను మధ్యలోనే ఆపేశారు. దాంతో కొన్ని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.

నిరుపయోగంగా సిమెంట్ బస్తాలు, సామగ్రి

మండలంలో 58 పాఠశాలలో పనులు ప్రారంభంకాగానే వాటికి సంబంధిత సిమెంట్, సామగ్రి, గ్రానైట్, ఉడ్ వర్క్ పనుల సామగ్రిని అధికారులు సరఫరా చేశారు. అయితే అలా సరాఫరా చేసిన సుమారు 5000 సిమెంట్ బస్తాలను ఇప్పటికి వాడకపోవడంతో అవి గడ్డ కట్టి వృథాగా మారినట్లు సమాచారం. గ్రానైట్ బండలు పగలిపోగా.. ఉడ్‌కు చెదలు పడుతున్నట్లు తెలుస్తోంది.

పనులు పూర్తి చేయాలి..




నాడు-నేడు కింద పాఠశాలల్లో పనులు మధ్యలోనే నిధులు లేవని ఆపేశారు. దాంతో విద్యార్థులకు గదులు కొరత ఏర్పడింది. నాశిరకం పనులు చేయడంతో శింగనమలలో చాలా గదులల్లో పై పెచ్చులు ఊడి పడుతున్నాయి. నాశిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

-సురేష్ కుమార్, శింగనమల విద్యాకమిటీ చెర్మన్

పై.. పై.. మెరుగులే...

శింగనమల జిల్లా పరిషత్ పాఠశాల ఆలూరు సాంబశివారెడ్డి చదువుకొన్న పాఠశాల కావడంతో ప్రత్యేకంగా నాబార్డు నిధులు రూ.1.8 కోట్లను మంజూరు చేయించుకున్నారు. పాఠశాలలో గదుల పైకప్పులన్నింటికి మర్మమతులు చేయించారు. గోడలకు రంగులేశారు. పాఠశాల గేటును అందంగా అలంకరించారు. ప్రహరీ పక్కన ఉన్న చిరు వ్యాపారులను బలవంతంగా ఖాళీ చేయించి.. అక్కడ మొక్కలు నాటించారు. ఇలా పై.. పై.. మెరుగులే తప్ప.. పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించింది. ఇటీవలి వర్షాలకు గదులన్నీ కారుతున్నాయి. కప్పులు పెచ్చులూడుతున్నాయి. పాఠశాలలో మురుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించక పోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. పాఠశాలకు కనీసం తాగు, విద్యుత్తు సౌకర్యమూ కల్పించలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మండలంలో నిలిచిపోయిన పనులన్నింటిని పూర్తి చేయిస్తామని ఎంఈఓ నరసింహ రాజు తెలిపారు.

వరద బాధితులకు 'అమిలినేని' రూ.50 లక్షల విరాళం



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 6: వరద బాధితుల కోసం రూ. 50 లక్షలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అందజేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన టీడీపీ నాయకులు రాజగోపాల్, వెంకటేశులు కలిసి విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం పిలుపుమేరకు వరద బాధితులను ఆదుకునేందుకు మరింతగా సాయం చేస్తానని తెలిపారు. బాధితుల కోసం సీఎం రాత్రింబవళ్లు కష్ట పడుతున్నట్లు తెలిపారు. సీఎం పిలుపుతో వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతోమంది మానవత్వంతో ముందుకు వస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం వారు మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వైద్య కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటు



రిజిస్ట్రేషన్ పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6: అనంత వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. సంఘం ఏర్పాటుకు కళాశాలలో పూర్వవిద్యార్థులు, ప్రస్తుత డాక్టర్లు సమావేశమై శుక్రవారం చర్చించినట్లు వివరించారు. పూర్వవిద్యార్థుల సంఘం నూతన కమిటీకి ఆమోదం లభించింది. అధ్యక్షుడిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా డాక్టర్ రామస్వామినాయక్, కోశాధికారిగా మేడా ఆత్మారామ్, కో-ట్రెజరర్‌గా డాక్టర్ మధుసూదన్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ నవీన్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ పద్మశ్రావణి, డాక్టర్ హేమలత, డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ వెంకట రమాబాయి తదితరులు నియమితులయ్యారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. దశాబ్దాల కాలంగా వైద్యకళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా నెరవేరలేదని, ఇపుడు అది నెరవేరడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. తాను సంఘానికి గౌరవాధ్యక్షుడిగా ఉంటున్నానని కళాశాల అభివృద్ధికి ఈసంఘం ద్వారా కృషి చేస్తానన్నారు. ఇందుకోసం ప్రత్యేక ఆఫీస్‌ను ఏర్పాటు చేసి, ప్రతిమూడు నెలలకోసారి సమావేశమయ్యేలా చూస్తానన్నారు.

ఫలితం దిశగా...

- ☆ ఆసక్తికరంగా దులీప్‌ట్రోఫీ తొలి మ్యాచ్
- ☆ 168 పరుగులకు కుప్పకూలిన ఇండియా-సి
- ☆ రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 206/8
- ☆ అర్ధసెంచరీలతో రాణించిన శ్రేయస్, పడిక్కల్



రెండోరోజు ఆటలో దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6: దులీప్‌ట్రోఫీలో తొలి మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. ఫలితం దిశగా ఆట సాగుతోంది. స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం రెండోరోజు పోటీలు కొనసాగాయి. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్లకు 91పరుగులతో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-సి జట్టు 48.3ఓవర్లలో 168పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండోరోజు 77పరుగులు మాత్రమే చేసి మిగతా ఆరు వికెట్లను కోల్పోయింది. జట్టులో బాబా ఇంద్రజిత్ 149బంతుల్లో 9ఫోర్ల సాయంతో 72 పరుగులు చేశాడు. వికెట్‌కీపర్ అభిషేక్ పోరెల్ 34పరుగులు చేశాడు. ఎక్స్‌ట్రాలతో కలిసి ఇండియా-సి 168పరుగులు చేసి 4 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఇండియా-డి బౌలర్లు పేసర్ హర్షిత్ రాణా 4వికెట్లు, అక్షర్ పటేల్, శరాన్ష్‌జైన్ చెరో రెండు వికెట్లు, ఆదిత్యథాక్రే, అర్ష్‌దీప్‌సింగ్ చెరో వికెట్ పడగొట్టారు.

రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే తడబ్యాటు

ఇండియా-డి జట్టు మొదటి ఇన్నింగ్స్ తరహాలోనే రెండో ఇన్నింగ్స్‌లోను తడబడింది. ఇండియా-సి లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ 5 వికెట్లు పడగొట్టి ఇండియా-డి బ్యాటర్లను కట్టిడి చేశాడు. 15 ఓవర్లలో 30పరుగులు ఇచ్చి 5 కీలక వికెట్లు పడగొట్టాడు. మరో పేసర్ వైశాక్ 2, అన్షుల్ కాంబోజ్ వికెట్ పడగొట్టారు. దీంతో రెండో రోజు ఆటముగిసే సమయానికి ఇండియా-డి జట్టు 8 వికెట్ల నష్టానికి 206పరుగులు చేసింది. క్రీజులో అక్షర్‌పటేల్ 11పరుగులు, హర్షిత్‌రాణా పరుగులేమీ చేయకుండా ఉన్నారు. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కేవలం 44బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్ సాయంతో 54పరుగులు, పడిక్కల్ 70బంతుల్లో 8బౌండరీల సాయంతో 56పరుగులు చేశారు. మరో బ్యాటర్ రిక్కీభూయ్ 44 పరుగులు చేశాడు. ప్రస్తుతం ఇండియా డి జట్టు 202 పరుగుల ఆధిక్యంలో ఉంది.

అధికారుల మధ్య సమన్వయలోపం

నిర్వాహక అధికారులు, సభ్యుల మధ్య సమన్వయలోపంతో దులీప్‌ట్రోఫీలో పాసుల జారీలో గందరగోళం నెలకొంది. బీసీసీఐ సూచనల ప్రకారం ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ, ఆర్గనైజింగ్ కమిటీలు సమన్వయం చేసుకుని దులీప్‌ట్రోఫీ విజయవంతం చేయాలని భావించారు. అయితే గత రెండు రోజులుగా కొందరు పాసులు లేకుండానే లోపలికి రావడం, ఒక రకమైన పాసు పొంది మరో గ్యాలరీలోకి రావడం పట్ల కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మీడియా గ్యాలరీలోకి ఇతరులు రావడంతో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ మధ్య మనస్పర్థలకు దారితీసింది. నాసిరకంగా ఆహార పొట్లాలను ఇవ్వడం పట్ల మీడియా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులు మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంచో ఫెర్రర్ దృష్టికి తీసుకెళ్లారు. పాసుల జారీలో పలువురు మధ్య తీవ్ర మనస్పర్థలకు దారితీస్తున్నాయి. ఈ విషయాన్ని బీసీసీఐ ప్రతినిధులు, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని క్రికెట్ అభిమానులు కోరుతున్నారు.

తైక్వాండో రాష్ట్ర జట్టు కోచ్‌గా సాయిబాబా

తాడిపత్రి, సెప్టెంబరు 6: తైక్వాండో రాష్ట్ర జట్టుకు కోచ్‌గా తాడిపత్రికి చెందిన జిల్లా స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా ఎంపికయ్యారని రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సబ్, జూనియర్ కేటగిరిల్లో సుమారు 86మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 6: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేస్-2 కు అవుట్ ఫ్లో 932 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 54 క్యూసెక్కులు ఉన్నట్లు వారు వెల్లడించారు.

నవ యువకుడిలా పనిచేస్తున్న చంద్రబాబు

- బురద రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షం
- ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపాటు



విజయవాడకు వెళ్తున్న టమోటా వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, సెప్టెంబరు 6: వరద బాధితులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు 74ఏళ్ల వయసులో కూడా నవ యువకుడిలా పని చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కక్కలపల్లి టమోటా మండీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40టన్నుల టమోటాను విజయవాడ వరద బాధితులకు ప్రత్యేక వాహనాల్లో పంపే ఏర్పాట్లు చేశారు. వీటిని ఎలాంటి బాడుగ లేకుండా తీసుకెళ్లేందుకు ది అనంతపురం హెవీ గూడ్స్ లారీ ఓనర్స్ ముందుకొచ్చారు. వాహనాలను ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల్ని ఆదుకునేందుకు టమోటా మండీ ఓనర్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. రవాణా సౌకర్యం కల్పించిన లారీ ఓనర్స్‌ను అభినందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు గత ఐదు రోజులుగా అక్కడే ఉండి రాత్రింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇంత సాయం చేస్తుంటే ప్రతిపక్షాలు బురద రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలన్నారు. గతంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మీ ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయికి వెళ్లకుండా విమానాల్లో పర్యటించిన విషయం మరువరాదన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ మండీ అసోయేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్, లారీ అసోయేషన్ అధ్యక్షుడు నీలకంఠ నాయుడు, మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సర్దానప్ప, మణికంఠబాబు, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిఖరమంత అభిమానం

ఒంటినిండా క్రికెటర్ శిఖర్‌ధావన్ టాటూలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6: క్రికెట్‌ను ఓ మతంగా భావించే మనదేశంలో క్రికెటర్లను వేల్పులుగా చాలా మంది ఆరాధిస్తారు. అనతి కాలంలోనే క్రికెట్ అభిమానుల మనసు చూరగొన్న బ్యాటర్లలో శిఖర్‌ధావన్ ఒకడు. స్ట్రోక్‌ప్లేతో ఎన్నో మ్యాచ్‌లలో ఆయన అద్భుతంగా రాణించాడు. ఆ ఆటకు ముగ్ధుడైన బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరుకు చెందిన శంకర్ గీతా ధావన్ వీరాభిమానిగా మారాడు. గత 13ఏళ్లుగా శిఖర్‌ధావన్ ఎక్కడా మ్యాచ్ ఆడితే అక్కడికి వెళ్లేవాడు. ఇలా శిఖర్ ధావన్ కళ్లలో పడిన శంకర్ గీతాధావన్‌ను ఇప్పటి వరకు సుమారు 13దేశాలకు తన వెంట సొంత ఖర్చులతో తీసుకెళ్లాడు. అభిమానం ఆరాధనగా మారడంతో శంకర్ గీతా ధావన్ తన ఒంటిపైన రూ.13లక్షలు ఖర్చు పెట్టి శిఖర్‌ధావన్ జీవిత చరిత్ర మొత్తం తన ఒంటిపై టాటూ(పచ్చబొట్టు) వేసుకున్నాడు. ఈక్రమంలో అనంతపురం జరిగే దులీప్‌ట్రోఫీ మ్యాచ్ చూడటానికి వచ్చిన ఆయన క్రికెట్ అభిమానులకు తన ఒంటిపై ఉండే టాటూలను చూపుతూ ఆకట్టుకుంటు న్నాడు. శిఖర్‌ధావన్‌లా శంకర్ గీతాధావన్ కూడా పిలక పెంచాడు.



టాటూలతో శంకర్ గీతా ధావన్


పుట్టపర్తిలో పూజాసామగ్రిని కొనుగోలు చేస్తున్న పట్టణవాసులు


చెరకు, వెలగపండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు


మట్టి వినాయక ప్రతిమల కొనుగోళ్లు


ఓడీసీలో జనాలతో కిక్కిరిసిన దుకాణాలు


కదిరి నుంచి గ్రామాలకు తరలిస్తున్న గణనాథుని ప్రతిమలు


ధర్మవరంలో అలంకార వస్తువులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

వీధివీధినా వినాయకుడు

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి సందడి

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 6 : జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పండుగ సందడి మొదలైంది. వీధివీధినా వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు యువకులు మంటపాలను ఏర్పాటు చేశారు. ధర్మవరం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ శుక్రవారం కిటకిటలాడింది. వినాయకచవితి సందర్భంగా ప్రజలు వినాయక ప్రతిమలు కొనుగోలు చేయడంతో పాటు పూజా సామగ్రి, చెరుకుగడలు, గరెక, పండ్లు తదితర వాటిని కొనుగోలు చేసేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంజుమన్‌సర్కిల్ వరకు తోపుడు బండ్లపై వీటిని విక్రయించారు. పట్టణ, గ్రామాల్లో నెలకొల్పే వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ప్రత్యేక వాహనాల్లో, ఎద్దుల బండ్లలో తీసుకెళ్లారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

పుట్టపర్తిరూరల్: జిల్లాప్రజలకు మంత్రులు సవిత, సత్యకుమార్, కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అందేవిధంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

కదిరి అర్బన్: పట్టణంలో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. పట్టణాలు... పల్లెలు అనే తేడా లేకుండా గణేష ప్రతిమలు వివిధ రకాల ఆకృతిలో విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పండుగ నేపథ్యంలో పూజ సామగ్రి కొనుగోలు చేయడానికి భక్తులు బారులు తీరారు. పట్టణంలోని ప్రధాన కూడలిల్లో సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద, సింహకోట, ఎర్రకోట, శివాలయం ప్రాంతాల్లో గణేష్ భారీ ప్రతిమలు కొలువుతీరనున్నాయి. గ్రామాలకు గణనాథుల ప్రతిమలను యువత తీసుకెళ్లారు.

ఓబుళదేవరచెరువు: వినాయక చవితి పండుగ సందర్భంగా స్థానిక పూజాసామగ్రి దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి. వినాయక మట్టి ప్రతిమలు, అలంకరణ వస్తువులు, పూజాసామగ్రిని కొనుగోలు చేయడానికి ప్రజలు బారులుతీరారు.


ధర్మవరంలో వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న మహిళ


ధర్మవరంలో పూలు, టెంకాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


మట్టి వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న ప్రజలు


చెరకులు కొనుగోలు చేస్తున్న భక్తులు


పండ్లు కొనుగోలు చేస్తున్న ధర్మవరం వాసులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

తనకల్లు, సెప్టెంబరు 6: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో గణపతి, నాగుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొక్కంటి క్రాస్ చెందిన పలువురు భక్తులు, ఆలయ నిర్వాహకులు ఇటికి వెంకటరమణ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు బాలాజీ పాల్గొన్నారు.


ఆలయంలో ప్రతిష్ఠించిన గణపతి, నాగుల విగ్రహాలు

14న మహిళా టీచర్లకు క్రీడాపోటీలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 6: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో ఈనెల 14న మహిళ ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కోశాధికారి, కార్యదర్శులు శ్రీనివాసులు, తాహేర్‌వలీ శుక్రవారం తెలిపారు. అందుకు సంబంధించిన బ్యానర్ ఆవిష్కరించారు. మహిళ ఉపాధ్యాయులకు త్రోబాల్, షాట్‌పుట్, టెన్నికాయిట్, స్పీడ్ వాక్, షటిల్ తదితర క్రీడలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీఈటీలు యశోద, సుజాత, ఉపాధ్యాయులు రాణి, లక్ష్మి, ప్రత్యూష పాల్గొన్నారు.


బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న టీచర్లు

అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 6: అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలివ్వాలని తహసీల్దార్ రంగనాయకులకు సీపీఐ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఇనగలూరు పంచాయతీలో రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదలకు ఇంటిపట్టాలు మంజూచేయాలని కోరారు. రెండేళ్ల క్రితం ఇళ్లస్థలాలు, ఇళ్లులేని వారు గుడిసెలు వేసుకొని... జీవిస్తున్నా వారికి కనీసం నీళ్లు, కరెంటు సౌకర్యాలు కల్పించలేదన్నారు. పేదలకు పట్టాలు మంజూరు చేసి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయులు, మండల కార్యదర్శి చలపతి, మహిళసంఘం రత్నాబాయి, సుధాకర్, రమణ, దేవేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

బత్తలపల్లి, సెప్టెంబరు 6: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో సీడీపీఓ సరస్వతి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

నీటి ప్రణాళికపై శిక్షణ

తనకల్లు, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని జనజాగృతి కార్యాలయంలో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఐ ప్రాజెక్టులో పనిచేస్తున్న గ్రామీణ యువత, వలంటీర్లకు బోర్‌వెల్ మానిటరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా నీటి పరీవాహక ప్రాంత పరిధిలో ఉన్న వ్యవసాయబోర్లలో నీటి మట్టాలను ఎలా కొలవాలి.. వాటర్ బడ్జెట్ ఎలా తయారు చేయాలి... పంట, నీరు ప్రణాళిక ఎలా తయారు చేసుకోవాలి.. అన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రత్యేకించి ఆర్‌డబ్ల్యూఐ ప్రాజెక్టులోని గ్రామాల్లో వాటర్ సెక్యూరిటీ ప్లాన్లు తయారు చేయాలని తెలిపారు. ఏటా వాటర్ బడ్జెట్ ఆధారంగా పంట, నీరు, ప్రణాళిక తయారుచేసుకుని భూగర్భజలాల ఆధారంగా పంటలు సాగుచేసేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని పెద్దపల్లి, గొళ్లపల్లి, మార్పురివాండ్లపల్లి, పెద్దఎద్దువారిపల్లి, గేమేనాయక్ తండా మొగిలిచెట్లతండా గ్రామాలకు చెందన వలంటీర్లు, యువతీ యువకులు పాల్గొన్నారు.


బోర్‌వెల్‌లో నీటి మట్టం గుర్తించడంపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 6: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మంత్రి సత్యకుమార్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఆర్డీటీ స్టేడియంలో అటల్‌బీహారీ వాజ్‌పేయి క్రికెట్‌టోర్నీ రెండవ రోజు హోరాహోరీగా జరిగింది. శుక్రవారం జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో మొదటిమ్యాచ్ బిగ్ డాడీ ధర్మవరం, ఎలెవన్ లగాన్స్ టీంలు తలపడగా ఎలెవన్ లగాన్స్ జట్టు విజయం సాధించింది. అలాగే రొద్దం, ఆర్కే టీములు తలపడగా రొద్దం టీమ్, రొళ్ల టీచర్స్ స్పార్టనస్ టీములు తలపడగా స్పార్టనస్ టీమ్, ఎగ్రైస్ పీటీపీ, ధర్మవరం వన్‌టౌన్ పీసీ టీములు తలపడగా ఎగ్రైస్ పీటీపీ టీమ్, పోట్లమర్రి, ధర్మవరం కట్టేకింగ్స్ జట్లు తలపడగా కట్టేకింగ్స్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ప్రతిభ చూపిన ఎలెవన్ లగాన్స్, బుట్రబాబు, రొద్దం రాజేష్, స్పార్టనస్ సోమశేఖర్, ఎగ్రైస్ పీటీపీపీ భరత్, ధర్మవరం కట్టేకింగ్స్ పెద్దన్న ఆటగాళ్లకు ప్లేయిర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు దక్కాయి. వీరికి బీజేపీ నాయకులు హరీష్, సాకే ఓబిలేసు, డోలా రాజారెడ్డి, గుండా పుల్లయ్య, జింకా చంద్రశేఖర్, చెర్లోపల్లి నారాయణస్వామి, అంబటి సతీష్, ఎర్రజోడు లోకేష్, సుబ్బరావుపేట పవన్‌రెడ్డి పాల్గొన్నారు.


అవార్డు అందజేస్తున్న బీజేపీ నాయకులు



ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పండగొచ్చినా పస్తులే

పుట్టపర్తి, సెప్టెంబరు 6 : అందరూ పండుగను సంతోషంగా జరుపుకుంటుంటే జీతాలు లేక తాము, తమ కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోందని సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమాన్‌సర్కిల్‌లో ఆకులు తింటూ వారు నిరసన వ్యక్తంచేశారు. సీపీఎం నాయకులు లక్ష్మీనారాయణ, బాబావలి, గంగాధర్ నిరసన శిబిరంలో పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మధు, మురళి, నాగరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

కొత్తచెరువు, సెప్టెంబరు 6: వినాయక మండపాల్లో డీజేకి అనుమతి లేదని పుట్టపర్తి డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సత్యసాయిబాబా భజన మందిరంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర మతాల వారికి ఇబ్బందులు కల్గకుండా పండుగను జరుపుకోవాలన్నారు. నిమజ్జనం రోజు పోలీసులు సూచించిన మేరకు ఊరేగింపు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఇందిర, తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కదిరి అర్బన్, సెప్టెంబరు 6: భర్త వేధిస్తున్నాడని మండలంలోని ఎట్టిగట్టతండాకు చెందిన శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు రూరల్ సీఐ మోహన్ శుక్రవారం తెలిపారు. ఆమె భర్త గోవిందునాయక్ నిత్యం తాగి వచ్చి వేధిస్తున్నట్లు తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోవిందునాయక్, అతని తండ్రి గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

మట్టి విగ్రహాల పంపిణీ

ధర్మవరం, సెప్టెంబరు 6 : ఎన్డీఏ కూటమి ప్రధాన నాయకులకు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను అందజేసినట్లు కుమ్మరి యవసేన నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేంద్ర తెలిపారు. అనంతపురంలో టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌కు, ధర్మవరంలో జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి, బీజేపీ నాయకులు హరీశ్‌కు మట్టి వినాయక విగ్రహలను అందజేశామన్నారు. కార్యక్రమంలో యువసేన నాయకులు మహేశ్, రంగనాథ్, నాగరాజు, దామోదర్, తిప్పయ్య పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న పశువుల పట్టివేత

గోరంట్ల : కబేళాకు తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. సీఐ శేఖర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కదిరి రహదారిలో కొండాపురం క్రాస్‌రోడ్డు వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న 46 పశువులను శుక్రవారం పట్టుకున్నారు. మడకశిర మండలం గుడిబండ సంతనుంచి కేఏ55 ఏ0224 నెంబరు గల వాహనంలో తమిళనాడుకు పశువులను తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కొండాపురం క్రాస్‌లో వాహనాన్ని పట్టుకుని 29 ఎనుములు, నాలుగు ఎద్దులు, మిలిగినవి ఆవు, ఎనుము దూడలను పట్టుకున్నారు. లారీ యజమాని గుడిబండకు చెందిన ఈడిగ మంజునాథ్, కేరళకు చెందిన లారీ డ్రైవర్ యాసిఫ్‌ను అరెస్టు చేశారు.

10న బుక్కపట్నంలో జాబ్‌మేళా

బుక్కపట్నం, సెప్టెంబరు 6: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిరుద్యోగ యువతీయువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాధికారి అబ్దుల్ ఖైయుం శుక్రవారం తెలిపారు. ఈమేళాకు ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ యువకులు పాల్గొన వచ్చన్నారు.

డయాలసిస్ రోజుల మార్పులు

కదిరి అర్బన్, సెప్టెంబరు 6: కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్‌లో మార్పులు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డయాలసిస్ సోమవారం చేయించుకునేవారు ఒక రోజు ముందుగా ఆదివారమే రావాలని, అలాగే బుధవారం చేయించుకునేవారు మంగళవారమే రావాలని సూచించారు. వినాయక పండుగ, నిమజ్జనం ఉండడంతో ఈ మార్పులు చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని డయాలసిస్ వ్యాధిగ్రస్తులు గమనించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొత్తచెరువు, సెప్టెంబరు 6: స్థానిక పసలమంద, కమ్మపాళ్యంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గురువారం పలు ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయిన విషయం తెల్సిందే. దీంతో రూ. లక్షలు ఆస్తినష్టం జరిగింది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం 160 కెపాజిటీ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి.. ఆ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించారు.

ఎస్సీ శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

కొత్తచెరువు, సెప్టెంబరు 6: మండలంలోని తలమర్లలో ఎస్సీ శ్మశాన వాటికకు 45 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అందుకు సంబంధించిన పత్రాలను తహసీల్దార్ నాగరాజు, డీటీ స్వాతి ఆ కాలనీ వాసులకు శుక్రవారం అందజేశారు. దీంతో వారు కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.


శ్మశాన వాటికకు స్థల మంజూరు పత్రాన్ని అందిస్తున్న డీటీ స్వాతి

వికసిత్ ఆంధ్ర ప్రణాళికను సిద్ధం చేయండి: కలెక్టర్

పుట్టపర్తి, సెప్టెంబరు 6: వికసిత్ ఆంధ్ర 2047 కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యాక్షన్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఏడాది 15 శాతం వృద్ధి సాధించే దిశ గా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక సేవారంగాల్లో సాధించిన విజయగాధలు కేస్‌స్టడీస్ ఆయా శాఖల వారీగా నివేదికలు డాక్యుమెంటరీ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానశాఖాధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ అధికారి పద్మావతమ్మ, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఆర్‌డబ్ల్యూ ఎస్‌ఈ మల్లకార్జునప్ప, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాషా పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం వాసికి అవార్డు


సత్యనిర్ధారణ

ధర్మవరం, సెప్టెంబరు 6: పట్టణానికి చెందిన రెడ్‌క్రాస్ లైఫ్ సభ్యుడు సత్యనిర్ధారణ బెంగళూర్‌లోని స్వచ్ఛంద సంస్థ సోమలరాజు ఫౌండేషన్ మదర్ థెరిస్సా అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సత్యనిర్ధారణ మాట్లాడుతూ... తాను 30 ఏళ్లుగా ఎన్‌జీఓలతో ధర్మవరంలో వృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత వైద్య శిబిరాల ద్వారా వైద్యం అందేలా చేశానన్నారు. రెడ్‌క్రాస్ లైఫ్ మెంబరుగా 1600 మందితో రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ సేవలను గుర్తించి తనను మదర్‌థెరిస్సా అవార్డుకు ఎంపిక చేశారన్నారు. ఈ అవార్డును బెంగుళూర్‌లోని సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా త్వరలో అందజేస్తారన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి తీర్మానం

ముదిగుబ్బ, సెప్టెంబరు 6: మండలంలోని వివిధ గ్రామాలకు సిమెంటు రోడ్లు వేయాలని మండల సర్వ సభ్య సమావేశంలో తీర్మానం చేసినట్లు ఎంపీపీ ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ వరద బాధితులకు సహాయం చేయడానికి మండల సమావేశంలో రూ.56,500 ఆర్థిక సాయం అందించేందుకు సభ్యులు సహాయం చేసినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు రూ. మూడు కోట్ల ఉపాధి నిధులతో సిమెంటు రోడ్లు నిర్మించాలని తీర్మానం చేశామన్నారు. అలాగే పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచులు తమ దృష్టికి తెచ్చారని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. మండల సమావేశానికి గైర్హాజరవుతున్న మండల అధికారులపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కవిరాజు, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, వివిధ శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై జగన్ విమర్శలు దుర్మార్గం

ధర్మవరం, సెప్టెంబరు 6: వరద బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాలుగా ఆదుకుంటున్నా... మాజీ సీఎం జగన్ విమర్శలు చేస్తుండటం దుర్మార్గమని తెలుగు యువత సోషల్ మీడియా జిల్లా కో-ఆర్డినేటర్ తోటవాసుదేవ ధ్వజమెత్తారు.. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... జగన్ బురద, శవ రాజకీయాలు మానుకోవాలన్నారు. జగన్ చేస్తున్న నీచ రాజకీయాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. విపత్తుల సమయంలో పార్టీలకు అతీతంగా మానవతా దృక్పథంతో ప్రజలను ఆదుకోవాలన్నారు.

సత్యసాయి సేవా సమితి వైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 6: మండలంలోని కొండకమర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా శిబిరానికి హాజరైన రోగులకు అన్నదానం సౌకర్యం కల్పించారు. ప్రతినెలా ఆరో తేదీన వైద్యశిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యాసామగ్రి పంపిణీ

ముదిగుబ్బ, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా స్థానిక వడ్డిపేట ప్రాథమిక పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు కేతన వెంకటపతి పెన్నులు, పెన్సిల్లు, ఇతర సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు కేతన ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సూరి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

పెనుకొండ రూరల్: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం లారీ ఢీకొని శివరాంరెడ్డి (60) మృత్యువాత పడ్డారు. కియ హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల మేరకు పావగడకు చెందిన శివరాంరెడ్డి సోమందేపల్లి మండలం పందిపర్తిలో తన కుమారుడిని చూసేందుకు వెళ్తూ పెనుకొండ వైజంక్షన్‌లో వేచి యున్నారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే లారీ(టీఎన్52పీ 8474) అతివేగంగా వచ్చి శివరాంరెడ్డిని ఢీ కొంది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడం కోసం స్థానిక సత్యకృప డిగ్రీకళాశాల విద్యార్థినులు శుక్రవారం విరాళాలు సేకరించారు. ఎన్టీఆర్‌సర్కిల్, అంజుమన్‌సర్కిల్, దుర్గమ్మగుడి వీధి పరిసర ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు.


విరాళాలు సేకరిస్తున్న, విద్యార్థినులు

బ్రోవగ రావయ్యా..బొజ్జ గణపయ్యా..!



మండపాలకు తరలిస్తున్న విగ్రహాలు

హిందూపురం/అర్బన్/మడకశిరటౌన్/గోరంట్ల/పెనుకొండ/రొళ్ల, సెప్టెంబరు 6: వినాయక చవితి వేడుకలకు అంతా సిద్ధమయ్యింది. వాడవాడలా బొజ్జగణపయ్య కొలువుదీరనున్నాడు. వినాయక మండపాల అలంకరణలో యువకులు పోటాపోటీగా తీర్చి దిద్దుతున్నారు. హిందూపురం పట్టణంలో సుమారు పెద్ద విగ్రహాలు 50దాకా మండపాల్లోనే తయారుచేయించగా మరో 200కుపైగా విగ్రహాలను కర్నాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. గతేడాది ఒక అడుగు వినాయక విగ్రహం రూ.200నుంచి రూ.500కు పెంచారు. పట్టణంలో రూ.20వేలు విగ్రహంతో మొదలుకుని రూ.10లక్షల విగ్రహం వరకు ఏర్పాటు చేశారు. మండప నిర్వాహకులు ముందస్తుగా విగ్రహాన్ని ఎంపిక చేసుకుని శుక్రవారం సాయంత్రానికి ఆయా మండపాలకు తరలించారు. వినాయక చవితి పురస్కరించుకుని శుక్రవారం పండగకు సరుకుల కొనుగోలు చేసేవారు, పూజాసామాగ్రి కొనేందుకు పట్టణంతోపాటు పల్లెల నుంచి వచ్చేవారితో పూలమార్కెట్, కూరగాయలమార్కెట్, సరుకులు కొనుగోలుచేసేందుకు కిక్కిరిసారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. పెనుకొండ, మడకశిర, గోరంట్ల తదితర పట్టణాల్లో పండుగ సందర్భంగా మార్కెట్లు కిటకిటలాడాయి. వినాయక విగ్రహాల కొనుగోళ్లకు జనం పోటెత్తారు. మడకశిరలో దాదాపు 20 చోట్ల బొజ్జ గణపయ్యలు ప్రతిష్ఠించేందుకు విశేషంగా మండపాలను అలంకరించారు. గోరంట్ల శ్రీవర సిద్ధివినాయక ఆలయంలో 66 వ నవరాత్రి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. దేవదాయ శాఖాధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు ఉదయ్‌కుమార్ శుక్రవారంనుంచి 14వతేదీవరకు 9రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చివరిరోజున ముత్యాలపల్లకీపై నగరోత్సవం ఉంటుందని, భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.



మడకశిరలో సిద్ధంగా ఉంచిన గణపయ్యలు



హిందూపురంలో కిక్కిరిసిన మార్కెట్



గోరంట్లలో ఉత్సాహంగా విగ్రహాన్ని తీసుకెళ్తూ..



హిందూపురం పూలమార్కెట్‌లో..



హిందూపురంలో మట్టివిగ్రహాల పంపిణీ



బీకేను సన్మానిస్తున్న ఉప్పర సంఘం నాయకులు

కల్యాణ మండపానికి నిధులివ్వండి

● ఎంపీ బీకేకు ఉప్పరసంఘం వినతి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 6: సోమందేపల్లిలో కల్యాణమండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉప్పర సంఘం నాయకులు.. ఎంపీ బీకేను కోరారు. శుక్రవారం పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ.. తనవంతుగా కల్యాణమండప నిర్మాణానికి రూ.కోటి విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో సైతం వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి పాటుపడ్డామన్నారు. అనేక కల్యాణ మండపాలకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉప్పర కులస్థులకు సహకారం అదించడంతో ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గోపాల్, శేఖర్, రామచంద్రప్ప, నల్లప్ప, గంగప్ప, ఆదినారాయణ, నాగప్ప, కొల్లప్ప, కొండప్ప, కుల్లాయప్ప, ఐదు మండలాలకు చెందిన ఉప్పర కులస్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన కమిషనర్

పెనుకొండ, సెప్టెంబరు 6 : స్థానిక పరిటాల డిగ్రీకళాశాలను ప్రభుత్వ ఉన్నతవిద్య కమిషనర్ పోలా భాస్కర్ ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు ఇటీవలే నాక్ బీ1 గ్రేడ్ రావడంపట్ల ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్, సిబ్బంది కృషిచేయాలని సూచించారు. విద్యా ప్రమాణాలు మెరుగు పరచడంతోపాటు విద్యార్థులకు విద్యపట్ల ఆసక్తిపెంచే రీతిలో బోధన చేయడంతోపాటు సామాజిక అభివృద్ధిలో భాగస్వామ్యులు అయ్యేవిధంగా అధ్యాపకులు కృషిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు పెరుగుతున్న సాంకేతికతను విద్యార్థులు అందుకునే విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు.

విజయవాడకు మున్సిపల్ యంత్రాంగం

హిందూపురం, సెప్టెంబరు 6 : విజయవాడ వరద బాధితుల సహాయచర్యలో పాల్గొనడానికి పురం మున్సిపల్ యంత్రాంగం తరలివెళ్లారు. మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వందమందికిపైగా మున్సిపల్ కార్మికులు ఐదు రోజులుగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. పారిశుద్ధ్య పనులతోపాటు కాలువలు శుభ్రం చేస్తున్నారు. పలుశాఖల అధికారులు కూడా విజయవాడకు తరలి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

ఐఎంఏ రూ.1.10 లక్షల విరాళం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 6: విజయవాడ వరద కష్టాలపై ఐఎంఏ సభ్యులు స్పందించారు. వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ 1.10 లక్షల రూపాయల చెక్కు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. హిందూపురం ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలకు తాము ముందుంటామన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి: ఎంపీడీఓ

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 6 : గ్రామాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ భాస్కర్ సిబ్బందిని ఆదేశించారు. అమరాపురం మండల కేంద్రంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుతో అత్యవసర సమావేశాన్ని ఎంపీడీఓ భాస్కర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో వీధిలైట్లు, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రామాల్లో సమస్యలపై ఆయన ఆరా తీశారు. ఈనెల 17వ తేదీలోగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఎంపీపీ ఈరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రత్యూష, ఈఓఆర్‌డీ నాగముని, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఆర్డీఓగా వెంకటశివరామిరెడ్డి



పెనుకొండ టౌన్, సెప్టెంబరు 6: పెనుకొండ ఇన్‌చార్జ్ ఆర్డీఓగా వెంకటశివరామిరెడ్డిని నియమించారు. ధర్మవరం ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా ఉన్న అపూర్వ భరత్ బదిలీకావడంతో అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీ ఉంది. ఈనేపథ్యంలో ఇన్‌చార్జి ఆర్డీఓ మాట్లాడుతూ.. ఆరు నియోజకవర్గాల్లో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి, పట్టాలు మంజూరుచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రభుత్వ స్థలాలు గుర్తించే పనిలో తహసీల్దార్‌లు ఉన్నారన్నారు.

సబ్సిడీతో ఉలవల పంపిణీ

గుడిబండ, సెప్టెంబరు 6 : మండలంలోని అర్హులైన రైతులకు 80శాతం సబ్సిడీతో ఉలవలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ వీరనరేష్ ప్రకటనలో తెలిపారు. వేరుశనగ పంట సాగుచేయని రైతులు ఉలవల కోసం రిజిస్ట్రేషన్‌కై ఆర్బీకే కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబరు, జిరాక్స్ కాపీలను తీసుకెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే సబ్సిడీ ఉలవలను అందిస్తామన్నారు.

వంతెన కూలినా పట్టించుకోరా..?

మడకశిర రూరల్, సెప్టెంబరు 6 : వంతెన కూలిపోయి ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నా పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మణూరు- కల్లుమర్రి ప్రధాన రహదారిలో కూలిన వంతెనను తిరిగి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వనికి తమ గోడును విన్నవించుకోన్నా పట్టించుకోలేదన్నారు. తీవ్ర వర్షాలకు ప్రధాన రోడ్డులోని వంతెన కూలిపోయింది. రెండు పంచాయతీల్లోని గ్రామాల ప్రజలు రాకపోకలతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన లేకపోవడంతో పొలాల గుండా ప్రయాణం సాగించేవారు. అయితే ప్రస్తుతం పొలాలు సాగుల్లో ఉండంతో అలా సాధ్యం కావడం లేదు. దారి లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు తమ పరిస్థితిని పరిశీలించి వంతెనను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కూలిన వంతెన

పండగను ప్రశాంతంగా చేసుకోవాలి

అగళి, సెప్టెంబరు 6: వినాయకచవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. మండల కేంద్రంలో ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక కమిటీమెంబర్లతో ఎస్సై వీరేష్ శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. శనివారం వినాయక పండగ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసుకుని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పలు విషయాలపై ఆయన సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సమాఆవేశంలో గణేష్ ఉత్సవ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముల మారెమ్మకు పూజలు



గుడిబండ, సెప్టెంబరు 6 : మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మలమారెమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి పూజలు

పెనుకొండ, సెప్టెంబరు 6: వినాయక చవితి పండగకు ముందురోజు వచ్చే గౌరమ్మ పండగను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం పండగ సందర్భంగా ఇంటిల్లిని శుభ్రంచేసి మామిడితోరణాలతో అలంకరించి, వ్రతం ఆచరించారు. గౌరమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేకంగా అలంకరించారు.



గౌరీ పూజ చేస్తున్న మహిళలు

తల్లి, బిడ్డలను కాపాడిన పురం పోలీసులు

హిందూపురం, సెప్టెంబరు 6: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలు సహా తల్లి ఆత్మహత్యాయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వారిని రక్షించారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన చైత్ర కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. తన ఇద్దరు పిల్లలు సహా రైలుకింద పడి చనిపోవాలనుకుంది. శుక్రవారం సాయంత్రం ఎంజీఎం పాఠశాల సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఉండగా.. గమనించిన స్థానికులు వెంటనే డయల్100కి సమాచారం ఇచ్చారు. వెంటనే ఏఎస్ఐ నాయక్, సిబ్బంది సుధాకర్, రామాంజనేయులు రైల్వే ట్రాక్ వద్దకెళ్లి, ఆమెను పక్కకు తీసుకొచ్చారు. తరువాత పది నిముషాల్లోనే అనంతపురం వైపు రైలు వెళ్లింది. పోలీసులు సకాలంలో స్పందించి ముగ్గురి ప్రాణాలను కాపాడారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

పెనుకొండ, సెప్టెంబరు 6: స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఓ కేశవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్య ప్రాముఖ్యత, ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కొత్త విద్యార్థులు పాత విద్యార్థులను సాదరంగా ఆహ్వానించారు. ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కబేళాలకు తరలిస్తున్న పశువుల పట్టివేత

గోరంట్ల, సెప్టెంబరు 6: కబేళాలకు తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. సీఐ శేఖర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కదిరి రహదారిలో కొండాపురం క్రాస్‌రోడ్డు వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న 46 పశువులను శుక్రవారం పట్టుకున్నారు. మడకశిర మండలం గుడిబండ సంత నుంచి కేఏ55 ఏ0224 నెంబరు గల వాహనంలో తమిళనాడుకు పశువులను తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కొండాపురం క్రాస్‌లో వాహనాన్ని పట్టుకుని 29 ఎనుములు, నాలుగు ఎద్దులు, మిలిగినవి ఆవు, ఎనుము దూడలను పట్టుకున్నారు. లారీ యజమాని గుడిబండకు చెందిన ఈడిగ మంజునాథ్, కేరళకు చెందిన లారీ డ్రైవర్ యాసిఫ్‌ను అరెస్టు చేశారు. కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని, అందులోని 46 పశువులను కర్ణాటకలోని తుముకూరు గోశాలకు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.





కంటైనర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు, పశువులను కుక్కేసిన దృశ్యం



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉపాధ్యాయురాలి బదిలీపై విద్యార్థుల నిరసన

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 6: ఉపాధ్యాయురాలి బదిలీ ఆపాలని విద్యార్థులు నిరసనకు దిగారు. పాఠశాలకు తాళం వేసి ఆందోళనకు చేపట్టారు. పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని బదిలీ చేయరాదంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు రాజేశ్వరి చక్కగా బోధిస్తూ విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటూ చదువు చెప్పేవారు. ఈమెపై కొందరు అధికారులు, నాయకులు ఉద్దేశపూర్వకంగా మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామానికి బదిలీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఆమె బదిలీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ బదిలీలు ప్రభుత్వం తీసుకునే నిర్ణయమని, రద్దు చేయడం తమ చేతుల్లో లేదన్నారు. దీంతో విద్యార్థులు నిరసన విరమించారు.

ఘనంగా మాజీ మంత్రి రామచంద్రారెడ్డి జయంతి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 6 : మంత్రిగా, ఎంపీగా పనిచేసి టీడీపీ కృషిచేసిన దివంగత మాజీ మంత్రి రామచంద్రారెడ్డి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత స్వగ్రామమైన కొండంపల్లి వ్యవసాయ పొలంవద్ద మంత్రి రామచంద్రారెడ్డి సమాధివద్దకు చేరుకుని ఆమె నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, కన్వీనర్ శ్రీరాములు, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



తండ్రి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత

మంత్రికి సీఐటీయూ నాయకుల వినతి

పెనుకొండ: జిల్లాలో 700మంది సత్యసాయి వాటర్ వర్కర్స్‌కు ఆరు నెలలుగా జీతాలు లేక వారి కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలుపరిష్కరించాలని కోరుతూ సీఐటీయు నాయకులు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. శుక్రవారం సీఐటీయు నాయకులు జిల్లా కార్యదర్శి రమేష్, వాటర్ వర్కర్స్‌యూనియన్ నాయకులు రాఘవేంద్ర, యల్లప్ప, జనార్దన్, తదితరులు మంత్రిని కలిసి వినతిని అందిస్తూ కార్మికులకు జీతాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. ఆమె సానుకూలంగా స్పందిస్తూ సమస్య త్వరలో పరిష్కరిస్తామన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 6: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని శివరాంరెడ్డి(60)అనే వృద్ధుడు మృత్యువాత పడ్డారు. కియ హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల మేరకు పావగడకు చెందిన శివరాంరెడ్డి సోమందేపల్లి మండలం పందిపర్తిలో తన కుమారుడిని చూసేందుకు వెళ్తూ పెనుకొండ వైజంక్షన్‌లో వేచియున్నారు. ఈక్రమంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే లారీ(టీఎన్52పీ 8474) అతివేగంగా వచ్చి శివరాంరెడ్డిని ఢీకొంది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 6 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. మండల పరిధిలోని ధనాపురం కొడికొండశిర హైవేలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం మహిళను ఢీకొనడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థుల సమాచారం మేరకు ఎస్ఐ రంగడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు తెలియకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలిని ఎవరైనా గుర్తిస్తే తనకు సమాచారం అందించాలన్నారు.

మహిళ ఆత్మహత్య

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 6 : మండలంలోని గొందిపల్లిలో కడుపునొప్పి తాళలేక వివాహిత శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. కియ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు గొందిపల్లికి చెందిన సునిత(39) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. శుక్రవారం కడుపునొప్పి అధికం కావడంతో పురుగుల మందు సేవించింది. గమనించిన బంధువులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తమ్ముడు సోమశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త సోమశేఖర్‌రెడ్డి, కుమారుడు ఉన్నారు.



సునీత మృతదేహం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అగ్నికి ఆహుతి

పావగడ, సెప్టెంబరు 6: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అగ్నికి ఆహుత య్యాడు. పావగడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పలవల్లి, వీరంపల్లి మార్గమధ్యంలో రైల్వే బ్రిడ్జి కింద అనుమానాస్పద స్థితిలో 43సంవత్సరాల వ్యక్తి అగ్నికి ఆహుతై మృతి చెందారు. వైఎన్ హొసకోటకు చెందిన రవికుమార్(43) అనే వ్యక్తి గురువారం రాత్రి 10గంటల సమయంలో వైఎన్ హొసకోట నుండి అద్దె ఉందని చెప్పి బయలుదేరి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం ఉదయంకల్లా పడవల్లి రైల్వేబ్రిడ్జి కింద అతను టాటాఏస్‌లో కాలి మృతిచెందిన విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని తుమకూరు అడిషనల్ ఎస్పీ అబ్దుల్ ఖాదర్ పావగడ సీఐ సురేష్, ఎస్సై గురునాథ్, సిబ్బంది తరలివెళ్లి పరిశీలించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.



కాలిపోయిన వాహనం

తేలు కుట్టి బాలుడుకి తీవ్ర అస్వస్థత



హిందూపురం అర్బన్, సెప్టెంబరు 6: తేలు కుట్టి ఏడేళ్ల బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం సలామత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చాంద్, కుమారుడు మహ్మద్ మొక్కల్లో పడి ఉన్న బాలు తీసుకోవడానికి చేయి పెట్టాడు. తేలు కుట్టడంతో కేక వేసి తల్లికి విషయం తెలిపాడు. ఆమె వచ్చి తేలును చంపేసి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం కోసం నంతపురం వెళ్లాలని వైద్యులు సూచించారు.